సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 18 । ఆగస్టు । 2024



బాసరలో భద్రత అంతంతే..

బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో భద్రత అంతంతే. ప్రధాన ఆలయం అయినప్పటికీ ప్రత్యేక బందోబస్తు చర్యలు కల్పించడం లేదు. 8లో ▸



వైభవంగా కావడి పండుగ

బేల: మండల కేంద్రంలోని టీచర్స్‌కాలనీ శివాలయంలో కావడి పండుగను శనివారం వైభవంగా నిర్వహించారు. శివలింగానికి గంగాజలంతో అభిషేక పూజలు నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం
33.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

రాఖీ బుకింగ్ సెంటర్ ప్రారంభం



బుకింగ్ సెంటర్ ప్రారంభిస్తున్న డీఎం

ఆదిలాబాద్: ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఆదిలాబాద్ బస్టాండ్‌లో రాఖీ బుకింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. డిపో మేనేజర్ కల్పన శనివారం ప్రారంభించి మాట్లాడారు. రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని దూరప్రాంతాలకు వెళ్లలేని సోదరీమణుల సౌకర్యార్థం ఆర్టీసీ కార్గో, లాజిస్టిక్స్ ఆధ్వర్యంలో బుకింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాఖీలు, మిఠాయిలను బుక్ చేసుకునే సౌకర్యం ఉందని పేర్కొన్నారు. కేంద్రంలో నేరుగా గాని, 91542 98531, 91542 98553, 91542 98533 నంబర్లలో గాని సంప్రదించాలని సూచించారు. ఇందులో లాజిస్టిక్స్ సేల్స్ టీం లీడర్ సాయన్న, ఆపరేషన్ టీం లీడర్ అన్సార్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



విజేతగా నిలిచిన కొమ్ము చరణ్ తేజ్

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన స్విమ్మర్ రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ షార్ట్ కోర్స్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో కొమ్ము చరణ్ తేజ్ 1500 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించగా, 400 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ట్రైనర్, చరణ్‌తేజ్ తండ్రి కృష్ణ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు విభాగాల్లో విజేతగా నిలవడంపై పలువురు అభినందనలు తెలిపారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి



రిజిస్టర్లు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

జైనథ్: ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీల్లో ప్రసవాలు పెంచేందుకు సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని డీఎంహెచ్‌వో కృష్ణారావు అన్నారు. మండలంలోని గిమ్మ పీహెచ్‌సీని శనివారం ఆయన తనిఖీ చేశారు. రిజిస్టర్‌లను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు వివిధ రకాల పరీక్షలపై శ్రద్ధ వహించాలని మెడికల్ ఆఫీసర్ సుచలను ఆదేశించారు. ఆయన వెంట డీఎంవో శ్రీధర్, తదితరులున్నారు.

సహాయ ఉపకరణాల ఎంపికకు ప్రత్యేక శిబిరాలు

కైలాస్‌నగర్: జిల్లాలోని దివ్యాంగులకు అవసరమైన సహాయ ఉపకరణాల ఎంపిక కోసం మహిళా, శిశు, దివ్యాంగ, వయోవృద్ధుల సంక్షేమశాఖ, హైదరాబాద్ అలింకో ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి సబిత ప్రకటనలో తెలిపారు. 20న నార్నూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 21న బోథ్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, 22న ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ గెజిటెడ్ హైస్కూల్ నంబర్–1లో ఈశిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, ఇటీవల పొందిన ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, యూనిక్ ఐడీకార్డుతో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3.30గంటల వరకు నిర్వహించనున్న శిబిరాలకు హాజరుకావాలని పేర్కొన్నారు.వివరాలకు08732- 222058 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు 'సర్వాయి' జయంతి వేడుకలు

కైలాస్‌నగర్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఈ నెల 18న అధికారికంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నిర్వహించే వేడుకలకు గౌడ కులస్తులు, బీసీ సంఘాల ప్రతినిధులు అధికసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.

జైనథ్ జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు, పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



రుణమాఫీ.. రగడ

- మాఫీ కాలేదంటూ ఆగ్రహించిన అన్నదాత
- రోడ్డెక్కి సర్కారు తీరుపై నిరసన
- పలుచోట్ల సీఎం దిష్టిబొమ్మతో శవయాత్ర
- సంఘీభావం తెలిపిన బీఆర్‌ఎస్
- సముదాయించిన అధికారులు, పోలీసులు
- ఫిర్యాదుల నమోదు, పరిష్కారం కోసం మార్గదర్శకాలు జారీ

మాఫీలో కోత పెట్టారు



నా పేరు సత్యపాల్. తలమడుగు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో నా పేరిట రూ.83 వేల రుణం ఉంది. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీలో రూ.52 వేలు మాత్రమే మాఫీ జరిగింది. ఈ విషయంలో బ్యాంకు అధికారులను సంప్రదిస్తే సాంకేతిక సమస్య కారణంగా ఇలా జరిగిందని చెబుతున్నారు.

రుణం మాఫీ కాలేదు



నా పేరు క్యాతం పోసాని. నాది బజార్‌హత్నూర్. నా భర్త క్యాతం చిన్నయ్య రెండేళ్ల కిందట అనారోగ్యంతో చనిపోయాడు. మాకు 2.20 ఎకరాల సాగు భూమి ఉంది. ఆయన బతికి ఉన్నప్పుడు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ. 1.30 లక్షల పంట రుణం తీసుకున్నాడు. చనిపోయిన తర్వాత ఆ భూమి నా పేరు మీద అయింది. పంట రుణం చిన్నయ్య పేరు మీదే ఉంది. ఆ రుణ మాఫీ జరగలేదు.

సాక్షి,ఆదిలాబాద్: రుణమాఫీపై జిల్లాలో శనివారం రగడ చోటు చేసుకుంది. తమకు మాఫీ కాలేదంటూ వందలాది మంది రైతులు రోడ్డెక్కి నిరసన చేపట్టారు. సర్కారు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని నాలుగు మండలాల్లో ఐదు చోట్ల ఆందోళనలు కొనసాగాయి. వీరికి బీఆర్‌ఎస్ నేతలు సంఘీభావం తెలిపారు. అయితే ప్రభుత్వంపై బురద జల్లే యత్నాలు మానుకోవాలని ప్రతిపక్షాలను కాంగ్రెస్ హెచ్చరించింది. ఓర్వలేని తనంతోనే బీఆర్‌ఎస్ ఈ విధంగా వ్యవహరిస్తోందని హస్తం నేతలు ధ్వజమెత్తారు. ఇదిలా ఉంటే ఆందోళన చేపట్టిన రైతుల దగ్గరికి చేరుకున్న అధికారులు, పోలీసులు వారిని సముదాయించారు. కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నట్లు అధికారులు హామీ ఇచ్చారు. ఇదిలా ఉంటే రుణమాఫీకి సంబంధించి అభ్యంతరాలుంటే ఫిర్యాదుల నమోదు, వాటి పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి జారీ అయిన మార్గదర్శకాలను జిల్లా వ్యవసాయ అధికారులు విడుదల చేశారు. మొత్తంగా రుణమాఫీ వివాదాన్ని పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళనలు విరమించారు.

ఆందోళనలు.. ఇలా

ప్రభుత్వం రైతుల వ్యవసాయ రుణాలకు సంబంధించి మూడు విడతల్లో రుణమాఫీ చేసిన విషయం తెలిసిందే. మొదటి విడత రూ.లక్షలోపు జరిగినప్పుడు పలువురు రైతులు తమ రుణం మాఫీ కాలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రెండో విడతలోనూ అదే పరిస్థితి కనబడింది. మూడో విడత గురువారం రూ.1.51 లక్షల నుంచి రూ.2 లక్షల్లోపు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. శుక్రవారం సాయంత్రం దీనికి సంబంధించి రైతుల పేర్లతో జాబితా రావడం, బ్యాంకుల్లో డబ్బులు జమ అయ్యే ప్రక్రియ షురూ అయింది. అయితే తమకు రుణమాఫీ కాలేదంటూ శనివారం ఉదయం నుంచి జిల్లాలో పలుచోట్ల రైతులు ఆందోళనలు చేపట్టారు. తలమడుగు, జైనథ్ మండల కేంద్రాలతో పాటు జైనథ్ మండలంలోని గిమ్మలో వందలాది మంది రైతులు రోడ్డెక్కారు. బోథ్, భీంపూర్‌లలోనూ ఆందోళనలు చోటు చేసుకున్నాయి. సీఎం దిష్టిబొమ్మలతో శవయాత్ర నిర్వహించారు. తలమడుగులో కర్మకాండ కుండలతోనే మహారాష్ట్ర బ్యాంకులోనికి వెళ్లారు. గిమ్మలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రకు రైతులు తాళం వేశారు. జైనథ్‌లో జాతీయ రహదారిపై బైఠాయించారు. ముళ్లకంపలు రోడ్డుకు అడ్డంగా వేసి రాకపోకలను అడ్డుకున్నారు. ఆ తర్వాత అధికారులు వారిని సముదాయించడంతో తాళాలు తొలగించారు. భీంపూర్‌లో సీఎం దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. అనంతరం దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

సముదాయించిన అధికారులు, పోలీసులు..

రైతులు ఆగ్రహంతో ఆందోళనలు చేపట్టగా అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకుని వారిని సముదాయించారు. గిమ్మలో జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, పోలీసులు ఆందోళనకారులకు నచ్చజెప్పారు. జైనథ్‌లో డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐ, ఎస్సైలు ఆందోళనకారులతో మాట్లాడారు. కలెక్టర్ రాజర్షిషాతో రైతులను ఫోన్‌లో మాట్లాడించారు. సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు, పోలీసులు భరోసా ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళనలు విరమించారు. ఇదిలా ఉండగానే రాష్ట్ర ప్రభుత్వం నుంచి రుణమాఫీకి సంబంధించి రైతుల అభ్యంతరాలు పరిష్కరించే విషయంలో మార్గదర్శకాలు జారీ చేసింది. దీనికి సంబంధించిన ప్రకటనను వ్యవసాయ అధికారులు శనివారం సాయంత్రం విడుదల చేశారు.



బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో రైతుల నిరసన ఇలా..



బోథ్ బస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

అధికార, ప్రతిపక్షాల మధ్య విమర్శలు..

జైనథ్‌లో రైతుల ఆందోళనలకు బీఆర్‌ఎస్ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి రైతుకు మాఫీ చేసే వరకు బీఆర్‌ఎస్ పోరాడుతుందని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే రైతులు అధైర్య పడవద్దని బోథ్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ అన్నారు. ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నాలను బీఆర్‌ఎస్ మానుకోవాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి ఆదిలాబాద్‌లో విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు.

ఆ అంశాలు ఇలా..

- అభ్యంతరాలున్న రైతులు ఆయా మండలాల వ్యవసాయ అధికారులను సంప్రదించాలి.
- సీఎల్‌డబ్ల్యూ పోర్టల్ (www. clw. telangana. gov. in) లో రైతు సమాచార పత్రాన్ని పొందుపర్చాలి. ఆ కాపీని రైతుకు కూడా అందజేయాలి.
- ఆధార్ తప్పుగా ఉన్న సందర్భంలో మండల వ్యవసాయ అధికారి తప్పనిసరిగా రైతు నుంచి ఆధార్ కాపీని పొందాలి. ఆ కాపీ అప్‌లోడ్ చేయాలి. ఓటర్ కార్డు, వాహన లైసెన్స్, రైతు రేషన్ కార్డు వంటి ప్రత్యామ్నాయ గుర్తింపు పత్రాన్ని సేకరించి అప్‌లోడ్ చేయాలి.
- కుటుంబాలు ఇంకా నిర్ణయించబడని సందర్భంలో మండల వ్యవసాయ అధికారులు తప్పనిసరిగా రైతు ఇంటిని సందర్శించాలి. వారు వెల్లడించిన ఆధార్ ఆధారంగా కుటుంబ సభ్యుల సంఖ్యను పరిశీలించాలి. ఆ వివరాలను పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలి.
- రైతు పాసుబుక్ లేని సందర్భాల్లో రైతు నుంచి పొందిన తర్వాత దాన్ని పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.
- ఆధార్‌లో పేరు, లోన్ ఖాతాలో పేరు మధ్య లోపాలు, అసమతుల్యత ఉన్న పక్షంలో రుణం తీసుకున్న వ్యక్తి గుర్తింపు కోసం చర్యలు చేపట్టాలి. అతని సరైన ఆధార్ నంబర్‌ను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.
- అసలు, వడ్డీ మొత్తంలో సరిపోలని పక్షంలో రైతు నుంచి దరఖాస్తు తీసుకుని వివరాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. నిర్ధారణ, దిట్టుబాటు కోసం బ్యాంకుకు పంపాలి.

'పోడు' పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక

- రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ తదితరులు

కైలాస్‌నగర్: పోడు భూముల సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. శనివారం ఆమె హైదరాబాద్‌లోని అరణ్య భవన్ నుంచి ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పోడు సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధంచేయాలన్నారు. సాగుచేస్తున్న పోడు భూముల హద్దులు, అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలన్నారు. అలాగే అనర్హులు అటవీ భూములను ఆక్రమించుకోకుండా చర్యలు చేపట్టాలన్నారు. అటవీ,గిరిజన సంక్షేమ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ఇందులో కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావ్ పాటిల్ పాల్గొన్నారు.

జూడాల రాస్తారోకో



బస్టాండ్ ఎదుట మానవహారంగా ఏర్పడిన జూడాలు

- వైద్య విద్యార్థిని దారుణ హత్యపై కొనసాగుతున్న నిరసనలు



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జూడాలు

ఆదిలాబాద్‌టౌన్: కోల్‌కతా వైద్య విద్యార్థిని దారుణ హత్యను నిరసిస్తూ రిమ్స్ మెడికోలు, జూడాల నిరసనలు కొనసాగుతున్నాయి. నాలుగైదు రోజులుగా విధులు బహిష్కరించి ఆందోళనలు చేపడుతున్నా రు. ఇందులో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ఎదుట మానవహా రంగా ఏర్పడ్డారు. నిందితులను కఠినంగా శిక్షించా లని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యా యం జరిగేంత వరకు ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కోల్‌కతాలో ఘటన మరువకముందే ఉత్తరాఖండ్‌లో నర్సుపై అత్యాచారం వె లుగులోకి వచ్చిందని పేర్కొన్నారు. ఇలాంటివి పు నరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. వైద్యులకు ప్రత్యేక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందులో జూడాల సంఘం అధ్యక్షుడు సందీప్‌చారి, మౌనిక, కారుణ్య తదితరులు పాల్గొన్నారు. డెంటల్ అసోసియేషన్, స్టాఫ్‌నర్సులు మద్దతు తెలిపి నిరసనలో పాల్గొన్నారు.

ఏబీవీపీ, సీఐటీయూ ఆధ్వర్యంలో..

కోల్‌కతా వైద్య విద్యార్థిని ఘటనకు సంబంధించి ఏబీవీపీ, సీఐటీయూ ఆధ్వర్యంలో వేర్వేరుగా నిరసనలు చేపట్టారు. రిమ్స్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ నిందితులను ఉరి తీయాలని డిమాండ్ చేశారు. ఇందులో ఏబీవీపీ కన్వీనర్ అక్షయ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్, పొచ్చన్న, రమాకాంత్, రమేశ్, రాణి, సునీత, సంగీత, పార్వతి, వనిత, ఆశన్న పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఆదిలాబాద్: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై అఘాయిత్యానికి పాల్పడి, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ధోని జ్యోతి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ చౌక్‌లో శనివారం నోటికి నల్లని రిబ్బన్లు కట్టుకొని క్యాండిల్ ర్యాలీ చేపట్టారు. బాధితురాలి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఇందులో స్వప్న, రేఖ, రుకుంబాయి, నంద, రవీనా, వెంకటలక్ష్మి, తదితరులున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీ సేవలు బంద్..



మూసి ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులు

కోల్‌కతా ఘటనను నిరసిస్తూ ఐఎంఏ ఆధ్వర్యంలో ప్రైవేట్ ఆస్పత్రులు ఓపీ సేవల బంద్ పాటించారు. శనివారం ఉదయం 6 నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు ఓపీ సేవలను నిలిపివేస్తున్నట్లు ఐఎంఏ అధ్యక్షుడు అశోక్ తెలిపారు. వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్యను ఖండించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం వైద్యులకు రక్షణ కల్పించాలని పేర్కొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

- కలెక్టర్ రాజర్షిషా
- ప్రైవేట్ వైద్యులతో సమావేశం

ఆదిలాబాద్‌టౌన్: ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో సమావేశ మందిరంలో ప్రైవేట్ వైద్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ నర్సింగ్ హోం తప్పనిసరిగా అనుమతి పొంది ఉండాలని పేర్కొన్నారు. అర్హతగల వారినే ల్యాబ్ టెక్నీషియన్‌గా నియమించుకోవాలన్నారు. తప్పనిసరిగా ఫైర్‌సేఫ్టీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. సోమవారం నుంచి జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులను వైద్యాధికారులు తనిఖీ చేస్తారని తెలిపారు. నిబంధనలు పాటించని వారికి నోటీసులు జారీ చేసి చర్యలు చేపడుతామని స్పష్టం చేశారు. జ్వరాలకు సంబంధించి ఎలాంటి కేసులు వచ్చినా సంబంధిత పీహెచ్‌సీల వైద్యాధికారులకు సమాచారం అందించాలన్నారు. డెంగీ వచ్చినట్లు అనుమానం వస్తే అవసరమైన ర్యాపిడ్ టెస్ట్ చేసి నిర్ధారణ కోసం రిమ్స్‌కు శాంపిల్స్ పంపించాలని ఆదేశించారు. రోగులను భయభ్రాంతులకు గురిచేసి అధిక ఫీజులు వసూలు చేయవద్దన్నారు. ప్రతీ ఆస్పత్రిలో తప్పనిసరిగా ధరల పట్టిక బోర్డు ప్రదర్శించాలని పేర్కొన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో కృష్ణారావు, ప్రోగ్రాం అధికారి నరేందర్ రాథోడ్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అశోక్, అధికారులు సాధన, మనోహర్, శ్రీధర్, వైసీ శ్రీనివాస్, ప్రైవేట్ వైద్యులు పాల్గొన్నారు.

శిశు మరణాలు నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో శిశు మరణాలు నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో చాంబర్‌లో ఐసీఎంఆర్ ప్రతినిధులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. శిశు మరణాలు తగ్గించేందుకు వైద్యాధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో శిశు మరణాల రేటు 8.23 ఉండగా, రాష్ట్ర వ్యాప్తంగా 21 శాతం, దేశవ్యాప్తంగా 26శాతంఉన్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో మరింతగా తగ్గేలా చూడాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గర్భిణులకు అవగాహన కల్పించాలని, రాయిసెంటర్ల ద్వారా సమావేశాలు నిర్వహించాలని పేర్కొన్నారు. గర్భిణులకు టీటీ ఇంజెక్షన్లు, ఐరన్ మాత్రలు, పిల్లలకు రోగనిరోధక టీకాలు వేయించాలని సూచించారు. అనంతరం గోండ్వాన పంచాయతీ రాయిసెంటర్ మేడి మెస్రం దుర్గును కలెక్టర్ సన్మానించారు. ఇందులో ఐసీఎంఆర్ ప్రతినిధులు డాక్టర్ తంగళన్, అధికారులు రవి నాయక్, పీటర్‌సన్, అనూష, డీఎంహెచ్‌వో కృష్ణారావు, ప్రోగ్రాం అధికారులు నరేందర్ రాథోడ్, డాక్టర్ సాధన, మనోహర్, శ్రీధర్, వైసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాలు తనిఖీ చేయాలి

- విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ రాజర్షి షా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: సంక్షేమ వసతిగృహాలు,ఆశ్రమ, రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలను విధిగా తనిఖీ చేసి విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ అధికారులు, గురుకుల ప్రిన్సిపాళ్లు, ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్లు, ప్రత్యేకాధికారులతో శనివారం రాత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి జిల్లాస్థాయి అధికారి వసతిగృహాలతో పాటు రెసిడెన్షియల్ పాఠశాలలను విధిగా తనిఖీ చేయాలన్నారు. విద్యార్థులకు అందించే ఆహారం మెనూ పకడ్బందీగా అమలయ్యేలా చూడాలన్నారు. డెంగీ జ్వరాలేమైనా ఉన్నట్లైతే శాంపిల్స్‌ను రిమ్స్‌కు పంపించాలన్నారు. రానున్న 45 రోజుల పాటు అప్రమత్తంగా ఉంటూ సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. వారం తరువాత రివ్యూ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో ట్రెయినీ కలెక్టర్ అభిఘ్యాన్ మాల్వియా, డీఆర్డీవో సాయన్న, జిల్లా వైద్యాధికారి నరేందర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య


దినేశ్‌ (ఫైల్‌)

తలమడుగు: మద్యానికి బానిసై ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగి గ్రామానికి చెందిన రాగి దినేశ్‌ (32)కు వివాహమై ఏడేళ్లయినా సంతానం కలగలేదు. రెండేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఏ పనీ చేయకుండా జులాయిగా తిరిగేవాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది మద్యం మత్తులో ఈనెల 3న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

గుంటకల్‌లో జిల్లా వాసి మిస్సింగ్‌


దేవురావు (ఫైల్‌)

తాంసి: భీంపూర్‌ మండలం చింతపల్లి గ్రామానికి చెందిన ఒకరు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా గుంటకల్‌ రైల్వేస్టేషన్‌లో తప్పిపోయాడు. కుమ్ర దేవురావు (29) ఈ నెల 12వ తేదీన తిరుపతికి దైవదర్శనం కోసం బంధువులతో వెళ్లాడు. దర్శనం అనంతరం ఈనెల 15న తిరిగి వస్తున్న క్రమంలో గుంటకల్‌ రైల్వేస్టేషన్‌లో తప్పిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తమ సోదరుడు మిస్సింగ్‌ అయినట్లు భీంపూర్‌ పోలీస్‌స్టేషన్‌లో భీంరావు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై కలీం తెలిపారు. దేవురావు ఆచూకీ తెలిస్తే 9959272153, 7729029944 నంబర్లకు తెలియజేయాలని సూచించారు.

PUBLIC NOTICE

It is informed public in General under the instruction of my client namely Mylaram Hanmanthu, S/o. Late Shivanna, Age: 53 years R/o. Bokkalguda Street of Adilabad, Dist. Adilabad. That my Client entered into an mutual agreement on 22.05.2024 with Sri Sanga Suresh, S/o. Ankulu R/o. H. No. 11-180, Situated at Dasnapur Locality of Adilabad in respect of house bearing No. 11-80, situated Dasnapur Locality of Adilabad for a valid consideration and executed a mutual agreement with Sri. Sanga Suresh, S/o. Ankulu and gave part amount towards advance. Now it called that if anybody is having any right or objections over the said property and agreement they may approach on following address within seven days from the date of this publication, if no any objection is received then my client will proceed further and will get registered the said property and after that no claim or objection will be entertain.

Sd/- GHANSHYAM Advocate,
Office: Gandhi Printing Press Lane,
Bhuktapur, Adilabad



సాక్షి క్లాసిఫైడ్స్‌

WANTED

■ సైట్‌ ఇంజినీర్స్‌ (సివిల్‌, మెకానికల్‌, ఎలక్ట్రికల్‌) సైట్‌ అకౌంటెంట్స్‌/సైట్‌ సూపర్‌వైజర్స్‌ / డ్రైవర్స్‌ కావలెను. మహారాష్ట్ర, కర్ణాటక మరియు తెలంగాణలో లిఫ్ట్‌ ఇరిగేషన్‌లో డ్రైవర్స్‌ హైవే అనుభవం ఉన్నవాళ్లు కావలెను. సంస్థ పేరు: PVC Projects, Hyd. కాల్‌: 040-23338080, adm.vineela@gmail.com. సంప్రదించు సమయం: 10am to 5pm [H-804857]

■ ఒమేగా హాస్పిటల్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని, వంట పని చేయుటకు వర్కర్స్‌/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 20K. ఫోన్‌: 8977639662, 8977639663 [H-796266]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,

బాసరలో భద్రత అంతంతే..

- ఆలయం, మండలానికి ఒకే ఠాణా
- ప్రధాన గుడిలో ఇన్‌చార్జీల పాలన
- వేడుకలప్పుడే బలగాల మోహరింపు
- బందోబస్తులో 28మంది హోంగార్డులే
- సీసీ కెమెరాలున్నా పర్యవేక్షణ కరువు


బాసర ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో భద్రత అంతంతే. ప్రధాన ఆలయం అయినప్పటికీ ప్రత్యేక బందోబస్తు చర్యలు కల్పించడంలేదు. ఏటా నిర్వహించే ఉత్సవాలు, ముఖ్య పర్వదినాల్లోనే ప్రత్యేక పోలీస్‌ బందోబస్తు ఏర్పాటు చేస్తారు. అమ్మవారి ఆలయానికి జడ్జిలు, ప్రముఖులు, మంత్రులు, ఉన్నతాధికారులు దర్శనానికి వచ్చిన సమయంలోనే పోలీసు బలగాలు కనిపిస్తాయి. ప్రధాన వ్యక్తులు బాసరకు వస్తున్నారని సమాచారం రాగానే కొద్ది గంటల ముందు బందోబస్తు చేపడతారు. ఆలయంలో మంత్రుల పర్యటన ఉన్నపుడు, ఉన్నతస్థాయి అధికారులు వచ్చినపుడే ప్రత్యేక పోలీసులు కనిపిస్తుంటారు. ఇక ఉత్సవాల్లో పాల్గొనే పోలీస్‌ బలగాలు ముగిసిన వెంటనే వెనుదిరిగి వెళ్లిపోతాయి.

ఇన్‌చార్జీల పాలనతో ఇక్కట్లు..

బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఇన్‌చార్జీల పాలన కొనసాగుతోంది. ఇక్కడ పనిచేసిన ఈవో విజయరామారావు పది రోజుల క్రితమే నిజామాబాద్‌ జిల్లా సహాయ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. ఇప్పటివరకు కొత్త ఈవోను నియమించలేదు. బదిలీపై వెళ్లిన విజయరామారావుకే ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. భద్రత సిబ్బంది నిర్లక్ష్యం వహించినా చర్యలు తీసుకోవడంలేదు. 28 మంది హోంగార్డుల్లో ఎవరు ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారో కూడా అధికారులకు తెలియని పరిస్థితి ఉంది. ఏళ్లుగా పాతుకుపోయిన హోంగార్డులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. బాసర ఆలయంలో జరిగిన చోరీ ఘటనతో ఈ విషయం బయటపడింది. ఈనెల 15న బాసర ప్రధాన ఆలయంలో జరిగిన చోరీ ఘటనలో 2 గంటలపాటు దొంగ లోపల సంచరించినా ఎవరూ గుర్తించలేకపోయారు. ఈ దృశ్యాలన్నీ సీసీ కెమెరాలో రికార్డయినా పర్యవేక్షించేవారులేరు. ఆ రోజు రాత్రి 10.30 గంటలకు క్యూలైన్‌ల మీదుగా నడుచుకుంటూ వచ్చి గోశాల పైనుంచి ఆలయంలోకి దిగి దత్తాత్రేయ ఆలయం ముందు ఏర్పాటు చేసిన హుండీని పగులగొట్టినా ఇక్కడ ఉండే హోంగార్డులు ఆ విషయాన్ని గుర్తించలేకపోయారు. వేకువజామున 3గంటల సమయంలో ఆలయం లోపలకు వెళ్లిన హోంగార్డులు దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఇదంతా గమనిస్తే భద్రత లోపం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఎస్పీ పర్యటనతో..

బాసర ప్రధాన ఆలయంలో బుధవారం రాత్రి చోరీ ఘటనపై ఎస్పీ జానకీషర్మిల శుక్రవారం ఆలయాన్ని సందర్శించారు. పోలీసులతో సమీక్షించారు. ఆలయ ప్రాంగణంలో భద్రతకు సరిపడా సీసీ కెమెరాలు లేవని, అవసరం మేరకు ఏర్పాటు చేయాలని సూచించారు. కెమెరాలను అనునిత్యం పర్యవేక్షించేందుకు ఇద్దరు ఉద్యోగులను నియమించాలని తెలిపారు. ఆలయంలో భద్రత లోపాలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. విధులను నిర్లక్ష్యం చేసిన ఆరుగురు హోంగార్డులను ఎస్పీ కార్యాలయానికి అటాచ్‌ చేసినట్లు చెప్పారు. భద్రత విషయంలో బాసర ఆలయాన్ని తన అధీనంలోకి తీసుకుని నెలపాటు పర్యవేక్షిస్తామని ఎస్పీ తెలిపారు. మారుతున్న కాలనికి అనుగుణంగా పోలీసులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భక్తులకు భరోసా కల్పించేలా భద్రత ఏర్పాట్లు ఉండాలని పేర్కొన్నారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పోలీస్‌ బందోబస్తు ఏర్పాటు చేసి నిఘా వ్యవస్థ పటిష్టం చేయాలని భక్తులు కోరుతున్నారు.

హోంగార్డులతోనే సరి...

బాసర ఆలయంలో 28 మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రధాన ద్వారం, క్యూలైన్‌లు, అక్షరాభ్యాస మండపాల్లో హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. బాసర ఆలయంలోకి వెళ్లే ప్రాంతాల్లో మెటల్‌డిటెక్టర్లు ఎక్కడా కనిపించడంలేదు. భక్తులను నేరుగా ప్రధాన ఆలయంలోకి అనుమతిస్తున్నారు. నిత్యం వేలాదిమంది భక్తులు బాసర శ్రీజ్ఞానసరస్వతీ అమ్మవారిని దర్శించుకుంటారు. ఆలయ అవసరాలు, భక్తుల భద్రత విషయంలో పెద్ద సంఖ్యలోనే నియంత్రణ కోసం సిబ్బంది అవసరం ఉంటుంది. అయినా ఎక్కడ ఆ స్థాయిలో ఏర్పాట్లు లేవు. ఇక బాసర ఆలయంలో 32చోట్ల సీసీ కెమెరాలున్నాయి. కానీ.. వీటిని ఎవరూ పర్యవేక్షించడంలేదు. నిఘా వ్యవస్థ పటిష్ఠంగా లేక ఆలయంలోనూ చాలాచోట్ల అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో అధికారులూ ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నారు.

ఒకే పోలీస్‌స్టేషన్‌..


బాసర పోలీస్‌స్టేషన్‌

బాసర ఆలయం, మండలానికి ఒకే పోలీస్‌స్టేషన్‌ ఉంది. ఆలయ పరిసరాల్లోని ఈ పోలీస్‌స్టేషన్‌ నుంచే మండలంలోని అన్ని గ్రామాల భద్రతను పర్యవేక్షిస్తున్నారు. బాసర ఆలయానికి ప్రత్యేకంగా పోలీస్‌స్టేషన్‌ లేదు. ఇక్కడుండే అధికారులే అమ్మవారి ఆలయాన్ని, భద్రతను చూస్తారు. ప్రతీరోజు పెట్రోలింగ్‌లో ఉండే కానిస్టేబుళ్లు వెళ్లి ఆలయ ఆవరణలో విధులు నిర్వహించే హోంగార్డులను కలిసి పరిస్థితిని తెలుసుకుంటారు. బాసర రైల్వేస్టేషన్‌, గోదావరి స్నానఘట్టాలు, బాసర బస్టాండ్‌, ట్రిపుల్‌ఐటీతోపాటు మహారాష్ట్ర సరిహద్దులున్నాయి. వీటన్నింటిని బాసర పోలీసులే పర్యవేక్షిస్తున్నారు. బాసర ఆలయానికి ప్రత్యేక పోలీస్‌స్టేషన్‌ ఏర్పాటు చేయాలని అంతా కోరుతున్నారు.

భద్రత చర్యలు చేపడుతున్నాం

బాసర ఆలయానికి వచ్చే భక్తులకు భద్రత కల్పించేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నాం. ఏ అవసరం వచ్చినా బాసర పోలీసులను సంప్రదించాలి. ఎక్కడ అనుమానితులు కనిపించినా మాకు సమాచారం ఇవ్వాలి. భక్తుల భద్రత విషయంలో రాజీ పడబోం. పూర్తిస్థాయిలో ప్రజలకు సేవలు అందిస్తాం.

– గణేశ్‌, బాసర ఎస్సై

ఏజెన్సీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

ఆదిలాబాద్‌టౌన్‌: ఏజెన్సీ ఉపాధ్యాయ బదిలీ ప్రక్రియలో తమకు అన్యాయం జరుగుతోందని ఎస్టీటీలు కలెక్టర్‌ రాజర్షి షా దృష్టికి తీసుకెళ్లారు. శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బేల మండలంలోని సైద్‌పూర్‌ స్కూల్‌ కాంప్లెక్స్‌కు సంబంధించి 18 వేకెన్సీలు ఉన్నప్పటికీ ఐదు ఖాళీలను మాత్రమే చూపించారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. శుక్రవారం అర్ధరాత్రి 12నుంచి శనివారం మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే ఆన్‌లైన్‌ దరఖాస్తులకు అవకాశం ఇచ్చారని, మధ్యాహ్నం 12నుంచి 2గంటల వరకు ఎడిట్‌ ఆప్షన్‌ ఇచ్చారని తెలిపారు. దీంతో చాలామంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోలేకపోయారని పేర్కొన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో బేల మండలంలోని సైద్‌పూర్‌ కాంప్లెక్స్‌ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని తెలిపారు. ఖాళీలన్నింటినీ చూపించాలని, తమకు ఆన్‌లైన్‌ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసినవారిలో గంభీర్‌రావు, ప్రభాత్‌రావు, గణపతిరావు, రమేశ్‌, దామోదర్‌ తదితరులున్నారు.

రీలొకేషన్‌ గ్రామాన్ని సందర్శించిన ట్రైనీ ఎఫ్‌ఆర్వోలు

కడెం: దూలపల్లి అటవీ శిక్షణ అకాడమీలో శిక్షణ పొందుతున్న అస్సాం రాష్ట్రానికి చెందిన 38 మంది ట్రైనీ ఎఫ్‌ఆర్వోలు శనివారం కడెం అటవీ రేంజ్‌లో పర్యటించారు. మండలంలోని రాంపూర్‌, మైసంపేట్‌ రీ లొకేషన్‌ కాలనీలో ఇండ్ల నిర్మాణాలు, వ్యవసాయ భూమి ని పరిశీలించారు. అనంతరం లక్ష్మీపూర్‌ బీట్‌ పరిధిలో బేస్‌ క్యాంపును సందర్శించారు. అటవీ, వన్యప్రాణుల సంరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలను కడెం ఎఫ్‌ఆర్వో గీతారాణి ట్రైనీ ఎఫ్‌ఆర్వోలకు వివరించారు. అటవీ సిబ్బంది రవికుమార్‌ తదితరులున్నారు.

విధి నిర్వహణలో ఉత్సాహంగా సాగాలి


విజేతగా నిలిచిన ఖమ్మం వాలీబాల్‌ జట్టుకు ట్రోఫీ ఇస్తున్న అధికారులు



క్యారం ఈవెంట్‌లో విజేతగా నిలిచిన జాకీర్‌కు ట్రోఫీ ఇస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌: విద్యుత్‌ ఉద్యోగులు క్రీడల్లో రాణించినట్లే విధి నిర్వహణలోనూ ఉత్సాహంగా సాగాలని ఆదిలాబాద్‌ విద్యుత్‌శాఖ ఎస్‌ఈ జేఆర్‌ చౌహాన్‌, నిర్మల్‌ ఎస్‌ఈ శ్రీనివాస్‌ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శుక్రవారం ప్రారంభమైన విద్యుత్‌ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి వాలీబాల్‌, క్యారం పోటీలు శనివారం ముగిశాయి. విజేతలుగా నిలిచిన జట్లకు వారు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని తెలిపారు. నిత్యం విద్యుత్‌ సరఫరా విషయంలో బిజీబిజీగా ఉండే ఉద్యోగులకు క్రీడల నిర్వహణ ఎంతో ఉత్సాహపూరిత వాతావరణాన్ని కలిగించిందని చెప్పారు. విద్యుత్‌ శాఖలోనూ ఎంతో ప్రతిభగల క్రీడాకారులున్నారని, ప్రోత్సాహన్నిస్తే మంచి క్రీడాకారులుగా ఎదుగుతారని ఆకాంక్షించారు. స్పోర్ట్స్‌ ఆఫీసర్‌ జగన్నాథ్‌, సెక్రటరీ శ్రీనివాస్‌, అధికారులు జీవరత్నం, దేవాగౌడ్‌, హరికృష్ణ, నాగరాజు, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

వాలీబాల్‌ విజేతగా ఖమ్మం, రెండో స్థానంలో మహబూబ్‌నగర్‌, మూడో స్థానంలో ఆదిలాబాద్‌ నిలిచింది. ఇక క్యారం టీం ఈవెంట్లో విద్యుత్‌ సౌధ జట్టు మొదటి స్థానం, రెండో స్థానంలో నిజామాబాద్‌, మూడో స్థానంలో మెట్రోజోన్‌ హైదరాబాద్‌ జట్లు నిలిచాయి. ఓపెన్‌ సింగిల్స్‌లో జాకీర్‌ (మెట్రో జోన్‌, హైదరాబాద్‌) విజేతగా నిలిచాడు. ఓపెన్‌ డబుల్స్‌ ఈవెంట్లో మొదటి రెండు స్థానాల్లో మెట్రో జోన్‌ హైదరాబాద్‌ నిలువగా, మూడో స్థానంలో విద్యుత్‌ సౌధ జట్టు నిలిచాయి.

యాంటీ డ్రగ్‌, ర్యాగింగ్‌ అవగాహన కార్యక్రమంలో
ట్రిపుల్‌ ఐటీ విద్యార్థులు


డ్రగ్స్‌ యాంటీ ర్యాగింగ్‌ పోస్టర్‌తో ఆర్జీయూకేటీ విద్యార్థులు

బాసర: తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన యాంటీ డ్రగ్‌, యాంటీ ర్యాగింగ్‌ అవగాహన కార్యక్రమంలో నిర్మల్‌ జిల్లా బాసర ట్రిపుల్‌ ఐటీ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ఆరు నిమిషాల నిడివిగల షార్ట్‌ ఫిల్మ్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్‌ వెంకటరమణ, డీజీపీ జితేందర్‌, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్‌ సెక్రెటరీ బుర్ర వెంకటేశం, సందీప్‌ శాండిల్య, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి శ్రీదేవసేనతో కలిసి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం వెంకటరమణ మాట్లాడుతూ డ్రగ్స్‌ వాడకంతో కలిగే దుష్పరిణామాలు, ఆరోగ్య సమస్యల గురించి వివరించారు. చాలామంది యువత సరదాగా మొదలుపెట్టిన ఈ అలవాటు వ్యసనంగా మారి భవిష్యత్తును నాశనం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి పదార్థాలు డ్రగ్స్‌ కిందకి వస్తాయి వాటికి విద్యార్థులు ఏ విధంగా ఆకర్షితులు అవుతారు అనే అంశాల గురించి వివరించారు. డ్రగ్స్‌ నియంత్రణకు విద్యార్థులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఇక కళాశాలల్లో విద్యార్థులు ర్యాగింగ్‌ కు పాల్పడితే చట్టపరంగా ఎలాంటి శిక్షలు ఉంటాయో వివరించారు. విద్యార్థులందరూ తమ తోటి విద్యార్థులతో సోదరభావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యాపకులు డాక్టర్‌ కొత్తపల్లి రాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంపై హక్కులు కల్పించాలి


ఆర్డీవోను కలిసేందుకు వచ్చిన కొలాం గిరిజనులు

కైలాస్‌నగర్‌: తమ ప్రాంతాల్లోని అటవీ సంపదపై తమకే హక్కులు కల్పించాలని ఇచ్చోడ, గుడిహత్నూర్‌, బజార్‌హత్నూర్‌, సిరికొండ, తలమడుగు మండలాల్లోని పీవీటీజీ కొలాం గిరిజనులు డిమాండ్‌ చేశారు. శనివారం కలెక్టరేట్‌కు తరలివచ్చిన ఆయా మండలాల్లోని 24 గ్రామాలకు చెందిన కొలాం గిరిజనులు ఆదిలాబాద్‌ ఆర్డీవో వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అడవినే నమ్ముకుని జీవించే తమపై అటవీశాఖ అధికారుల వేధింపులు అధికమయ్యాయని ఆరోపించారు. అడవిలోకి రానివ్వకపోగా, పోడు భూములను సాగు చేసుకోనివ్వడం లేదని వాపోయారు. తమకు అటవీ ప్రాంతాలపై హక్కులు కల్పిస్తే అడవిని కాపాడుకోవడంతో పాటు సంపదతో జీవనోపాధి పొందుతామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. ఆర్డీవోను కలిసిన వారిలో సెంటర్‌ ఫర్‌ కలెక్టివ్‌ డెవలప్‌మెంట్‌ ఎన్జీవో ప్రోగ్రాం మేనేజర్‌ కుమ్ర విఠల్‌రావు, గ్రామ పటేల్‌లు మడావి అనిల్‌, టేకం దిలీప్‌, కొడప రామారావు, చాకటి మహేందర్‌, జయవంత్‌రావు తదితరులున్నారు.

ఖానాపూర్‌లో పలు ఇళ్లలో చోరీ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సై

ఖానాపూర్‌: పట్టణంలోని విద్యానగర్‌ కాలనీలోని పలు నివాసాల్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. విద్యానగర్‌లో నివాసముండే కాగజ్‌నగర్‌కు చెందిన జడల కుమారస్వామి ఇంటికి తాళం వేసి శుక్రవారం కాగజ్‌నగర్‌ వెళ్లాడు. ఇదేరోజు రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి బీరువాలోని రూ.1.50లక్షల నగదు ఎత్తుకెళ్లారు. పక్కనే ఉన్న పెంబి మాజీ జెడ్పీటీసీ జానుబాయి నివాసంలోకి చొరబడ్డ దొంగలు రూ.32వేల విలువైన కాళ్ల పట్టీలు దొంగిలించారు. సమీపంలోని మరో రెండు ఇళ్లలోనూ చోరీకి యత్నించినా విలువైన వస్తువులేమీ ఎత్తుకెళ్లలేదు. కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అనంతరం క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. ప్రజలు ఇళ్లు వదిలి వేరే గ్రామాలకు వెళ్లేటప్పుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌తో పాటు సమీప నివాసాల వారికి సమాచారం ఇవ్వాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్‌

భైంసాటౌన్‌: పట్టణంలోని పేకాటస్థావరంపై పోలీసులు దాడి చేసి 12 మందిని అరెస్ట్‌ చేశారు. ఎస్సై ఎండీ షరీఫ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఎస్‌ఎస్‌ కాటన్‌ ఎదుట ఓ భవనంలో పేకాడుతున్నారన్న పక్కా సమాచారం మేరకు ఏఎస్పీ అవినాష్‌కుమార్‌ ఆధ్వర్యంలో శనివారం తనిఖీ చేయగా, 12 మంది పేకాడుతూ పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.57,690 నగదు, 12 మొబైల్‌ ఫోన్లు, రెండు బైక్‌లు, కారు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వీరిలో పలువురు బీజేపీ నాయకులు ఉండడం గమనార్హం.

రాష్ట్రస్థాయిలో జిల్లాకు పతకాల పంట


రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

ఆదిలాబాద్‌: జిల్లాకు చెందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌ పోటీల్లో పతకాల పంట పండించారు. మెదక్‌ జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో శనివారం నిర్వహించిన పదో తెలంగాణ రాష్ట్ర సీనియర్‌ (పురుషులు, మహిళలు) అండర్‌-23 అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌- 2024 పోటీల్లో పలు ఈవెంట్లలో విజేతలుగా నిలిచారు. పదివేల మీటర్ల ఈవెంట్లో రమేశ్‌కుమార్‌ గోల్డ్‌ మెడల్‌, స్టీపుల్‌ చేజ్‌ ఈవెంట్లో స్వాతి సిల్వర్‌, గౌరీ కాంస్యం సాధించారు. హ్యామర్‌ త్రోలో వీజీఎస్‌ రాకేశ్‌, అరుణ, ట్రిపుల్‌ జంప్‌లో సీహెచ్‌ వసంత కాంస్య పతకాలు దక్కించుకున్నారు. మొత్తంగా ఏడు పతకాలు సాధించడంపై అథ్లెటిక్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డి, సెక్రటరీ రాజేశ్‌, పెటా అధ్యక్ష, కార్యదర్శులు పార్థసారథి, స్వామి అభినందనలు తెలిపారు.

‘108’లో మహిళ ప్రసవం.. మగశిశువు మృతి

- నార్నూర్‌ ఆసుపత్రి నుంచి ఉట్నూర్‌కు తరలిస్తుండగా ఘటన
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ


ప్రసవంలో బిడ్డను కోల్పోయిన పెందూర్‌ దుర్గుబాయి

ఉట్నూర్‌రూరల్‌: పాలకులు మారుతున్నా ఆదివాసీల బతుకులు మారడం లేదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలని ఉన్నతాధికారులు పదేపదే చెబుతున్నా చిన్న చిన్న సమస్యలను సాకుగా చూపుతూ వైద్యులు, సిబ్బంది వేరే ఆసుపత్రికి రెఫర్‌ చేస్తూ గిరిపుత్రుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఓ గర్భిణిని ప్రసవ సమయంలో ‘108’లో నార్నూర్‌ నుంచి ఉట్నూర్‌కు తరలిస్తున్న క్రమంలో ఆమె మార్గమధ్యలోనే ప్రసవించింది. బాబుకు జన్మనివ్వగా ఆ నవజాత శిశువు పురిట్లోనే మృతి చెందిన ఘటన ఉట్నూర్‌ మండలంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితురాలి భర్త పెందూర్‌ ప్రభు తెలిపిన వివరాల ప్రకారం.. నార్నూర్‌ మండలం ఏంపల్లి గ్రామానికి చెందిన పెందూర్‌ దుర్గుబాయి ఏడు నెలల గర్భిణి. నొప్పులు రావడంతో శనివారం మధ్యాహ్నం నార్నూర్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మధ్యాహ్నం 3గంటల సమయంలో నొప్పులు అధికం కావడంతో అక్కడి వైద్యులు ఉట్నూర్‌ జిల్లా ఆసుపత్రికి రెఫర్‌ చేశారు. 108లో తరలిస్తున్న క్రమంలో ఉట్నూర్‌ మండలంలోని హస్నాపూర్‌ సమీపంలో ఆమె ప్రసవించింది. అయితే పురిట్లోనే శిశువు చనిపోయాడు. ఉట్నూర్‌ ఆసుపత్రికి చేరుకున్న మహిళకు చికిత్స అందించి ఆదిలాబాద్‌ రిమ్స్‌కు రెఫర్‌ చేశారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే బాబు ప్రాణాలు కోల్పోయాడని, 20 నిమిషాలు నార్నూర్‌ ఆసుపత్రిలోనే ఉంటే ప్రాణాలు దక్కేవని ప్రభు విలపించాడు. కాగా, నార్నూర్‌ ఆసుపత్రిని కలెక్టర్‌ తనిఖీ చేసిన మరుసటి రోజే ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం.

మెరుగైన చికిత్స కోసం రెఫర్‌ చేశాం

ఆసుపత్రికి వచ్చిన వెంటనే అన్ని పరీక్షలు చేశాం. అంతా బాగానే ఉంది. ఏడు నెలల్లోనే నొప్పులు రావడంతో డెలివరీ అనంతరం పుట్టబోయే బిడ్డకు మెరుగైన చికిత్స అవసరం ఉంటుంది. ఇక్కడ సౌకర్యాలు లేకపోవడంతో ఉట్నూర్‌కు రెఫర్‌ చేశాం. అక్కడి వైద్యులతోనూ మాట్లాడినం.

– డాక్టర్‌ రాంబాబు, నార్నూర్‌ ఆసుపత్రి

మొదటి కాన్పూ ఇదే తీరు..

గతేడాది కూడా తన భార్యకు ఏడు నెలలు గర్భంతో ఉండగా నొప్పులు రావడంతో నార్నూర్‌ ఆసుపత్రికి తీసుకువచ్చినట్లు ప్రభు చెప్పాడు. అక్కడి వైద్యులు పట్టించుకోకపోవడంతో తిరిగి ఇంటికి వెళ్లిపోయామని తెలిపాడు. ఇంటి వద్దనే ప్రసవం జరిగిందని, అప్పుడు కూడా బాబును కోల్పోయామన్నాడు. రెండుసార్లు కూడా వైద్యుల నిర్లక్ష్యంతోనే తమకు సంతానం లేకుండా పోతుందని విలపించాడు. విషయం తెలుసుకున్న తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపూరావు ఉట్నూర్‌ ఆసుపత్రికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్లక్ష్యం వహించిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.